గృహ ప్రవేశాలకు సిద్ధం

- టిడ్కో ఇళ్లను వచ్చే నెలలో అందజేసేందుకు చర్యలు
- ఎప్పటికప్పుడు పనులు పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు రాజు


టిడ్కో గృహాలు వద్ద నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు డ్రైనేజీలు


టిడ్కో గృహాల వద్ద నిర్మించిన వాటర్ ట్యాంక్

యలమంచిలి: పట్టణంలోని యర్రవరం వద్ద జాతీయ రహదారికి సమీపంలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లను పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేసేందుకు చకచకా పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే ఇళ్ల నిర్మాణం పూర్తయింది. విద్యుత్ సౌకర్యం కూడా కల్పించారు. రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి ట్యాంకు తదితర నిర్మాణాలు పూర్తి చేశారు.మిగిలిన కొద్దిపాటు పనులు పూర్తి చేసి, వచ్చే నెలలో లబ్ధిదారులతో గృహ ప్రవేశం చేయించాలన్న సంకల్పంతో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద గత ప్రభుత్వ హయాంలో పట్టణానికి 432 గృహాలు మంజూరయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణాన్ని అసంపూర్తిగా నిలిపివేయడంతో పాటు రోడ్లు, తాగునీరు,విద్యుత్ డ్రైనేజీ లాంటి సౌకర్యాలు కల్పించలేదు.

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే సీఎం జగన్‌మోహన్ రెడ్డి టిడ్కో గృహాలపై దృష్టి సారించారు. ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయించి, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.4.50 కోట్లు మంజూరు చేశారు. ఎమ్మెల్యే యు.వి రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తూ త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నారు. సీసీ రోడ్లు , డ్రైనేజీలు నిర్మించారు.తాగు నీటి అవసరాల కోసం 2.50 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంక్ నిర్మాణం చేపట్టారు. యలమంచిలి పట్టణంలో రూ.102 కోట్లతో చేపడుతున్న రక్షిత మంచినీటి పథకం నుంచి పైపు లైన్ల ద్వారా తాగునీటి అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

బ్యాంకు రుణాలు ఆలస్యం

ఎంపిక చేసిన 432 మంది లబ్ధిదారుల్లో 96మందికి ప్రభుత్వం ఒక్క రూపాయికే టిడ్కో ఇళ్లను మంజూరు చేయగా, మిగిలిన 336లో 274మంది లబ్ధిదారులకు మాత్రమే ఇప్పటి వరకు పలు జాతీయ బ్యాంకులు సుమారు రూ.10.10 కోట్ల రుణం మంజూరు చేశాయి. మిగతా వారి వయస్సు 60 ఏళ్లకు పైగా ఉండడం, సరైన హామీ పత్రాలు బ్యాంకులకు చూపించకపోవడంతో రుణం మంజూరు ఆలస్యం అవుతోంది.

మార్చిలో అందజేస్తాం



వచ్చే నెల మార్చి నాటికి పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించి, లబ్ధిదారులకు ఇళ్లు అందజేస్తాం. ఇందుకోసం యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయి. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి ట్యాంక్ నిర్మాణం పూర్తయ్యాయి.

– అనూష , టిడ్కో, ఏఈ

పేదల సొంతింటి కల సాకారం



టిడ్కో గృహాలతో పేద ప్రజల సొంతింటి కల నెరవేరుతోంది. అన్ని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకున్నాం. నా హయాంలో టిడ్కో గృహాలను పేదలకు అందజేస్తుండడం ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అవినీతికి తావు లేకుండా ఇళ్లు నిర్మించి ఇస్తున్నాం.

– యు.వి.రమణమూర్తి రాజు, ఎమ్మెల్యే, యలమంచిలి.

అద్దె భారం తప్పింది



మేము కొన్ని సంవత్సరాలుగా యలమంచిలిలో అద్దె ఇంటిలో ఉంటున్నాం. ప్రతి నెల అద్దె భారాన్ని భరించలేక పోతున్న సమయంలో ప్రభుత్వం మాకు అన్ని వసతులతో కూడిన ఇళ్ల త్వరలో అందజేయనుండడంతో సంతోషంగా ఉంది. మా సొంతింటి కల నెరవేర్చినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు – **బోడపాటి వెంకట లలిత,** లబ్ధిదారు, యలమంచిలి

కల్యాణోత్సవాలకు పటిష్ట బందోబస్తు

– ఉపమాక ఆలయాన్ని సందర్శించిన సీఐ


బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ నారాయణరావు

నక్కపల్లి: ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో వచ్చేనెల 3వ తేదీనుంచి ప్రారంభమయ్యే స్వామివారి కల్యాణోత్సవాలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్టు సీఐ నారాయణరావు తెలిపారు. శుక్రవారం ఆయన ఆలయాన్ని సందర్శించారు. ఎస్ఐ శిరీషతో కలసి కల్యాణోత్సవాల బందోబస్తుపై చర్చించారు. కొండ పైకి వెళ్లే మెట్లమార్గంలో రెయిలింగ్ మధ్య అక్కడక్కడా ఉన్న గ్యాప్‌లను గుర్తించారు. వాటిని మూసివేయాలని సూచించారు. ప్రధాన గోపురం నుంచి ప్రత్యేక క్యూకాంప్లెక్స్ వరకు బారికేడ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. నక్కపల్లి నుంచి ఉపమాక వరకు రహదారిపై ఈవ్‌టీజింగ్, ఇతర సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామని చెప్పారు. వాహనాలను ఆలయం వరకు అనుమతించకుండా ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు. గాలిగోపురం, ధ్వజస్తంభం, బేడామండపం , ఆస్థాన మండపం, ఉత్సవమూర్తులను ఉంచే కల్యాణ మండపాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. వచ్చే నెల 3నుంచి వారం రోజుల పాటు కల్యాణోత్సవాలు, నెలరోజుల పాటు తిరునాళ్లు జరుగుతాయన్నారు. లక్షలాది మంది కల్యాణం తిలకించేందుకు వస్తారని, వీరందరికీ ఎటువంటి అసౌకర్యం కలగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఏటా మాదిరిగా సుమారు 200 మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయ ప్రాంగణంలో దుకాణాలేవీ లేకుండా టీటీడీ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. టీటీడీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసు సిబ్బందితోమరోసారి సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ పబ్లిక్ వింగ్ అధ్యక్షుడికి అభినందనలు


దగ్గుపల్లి సాయిబాబాను అభినందిస్తున్న చిక్కాల రామారావు

పాయకరావుపేట : వైఎస్సార్‌సీపీ జిల్లా పబ్లిక్ విభాగం అధ్యక్షుడిగా నియమితులైన పట్టణ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబాకు పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. తనను కలిసిన సాయిబాబాను జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు దుశ్శాలువా కప్పి, పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

తుప్పల తొలగింపు


యాషాడపాలెం రోడ్డులో తుప్పలను తొలగిస్తున్న ఉపాధి సిబ్బంది

కోటవురట్ల: చినబొడ్డేపల్లి శివారు యాషాడపాలెం వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు, తుప్పలను శుక్రవారం తొలగించారు. ఉపాధి కూలీలతో వీటిని తొలగింపజేశారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ కృషి చేయాలని ఈ సందర్భంగా సర్పంచ్ పైల శివరామ్ కోరారు.

యువత కృషితో ప్లాస్టిక్ నిర్మూలన


స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్సీ వెంకటరమణ

అనకాపల్లిటౌన్ : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జోనల్ కమిషనర్ పి.వెంకటరమణ అన్నారు. స్థానిక గాంధీనగరం సంయుక్త డిగ్రీ కళాశాల విద్యార్థులకు స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి పర్యావరణాన్ని కాపాడినట్లయితే, భావితరాల ప్రజలకు మేలు చేసినవారిమవుతామన్నారు. జ్యూట్, కాటన్ సంచులు మాత్రమే వినియోగించాలని, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మొక్కలను నాటి, వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగంతో రోగాల బారిన పడుతున్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంయుక్త కళాశాల కరస్పాండెంట్ డి.మహేష్‌బాబు, జోనల్ సిబ్బంది ఆర్.రవికుమార్, డి.గోవిందరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

62 మందికి వైద్య సేవలు


వైద్య సేవలందిస్తున్న శ్రీవాణి

ఎస్.రాయవరం: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వమ్మవరంలో శుక్రవారం 62 మందికి వైద్యసేవలందించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి తగిన సూచనలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీవాణి, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ పరిశీలకులు అమీర్‌షాజిద్, 104 ఉద్యోగి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హాజరు లోపాలపై ఎంపీపీ ఆగ్రహం


ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లి రూరల్ : మండలంలోని సత్యనారాయణపురం సచివాలయ పరిధి మూలపేటలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను శుక్రవారం ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎంపీడీవో కె.ధర్మారావు తనిఖీ చేశారు. కూలీల సంఖ్య హాజరుపట్టీని పరిశీలించారు. హాజరులో అనేక లోపాలున్నట్టు గుర్తించారు. అక్కడ వున్న వీఆర్పీ నాగమణిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనికి గైర్హాజరైనవారికి హాజరు ఎందుకు వేశారని ప్రశ్నించారు. ఈ అవకతవకలపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను ఎంపీపీ కోరారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతీ ఒక్కరూ రోజుకు కూలీ రూ.257 వచ్చేలా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కర్రి మజ్జి అలివేణి, సర్పంచ్ పలక భాగ్యలక్ష్మి సత్తిబాబు, వైస్ సర్పంచ్ పి.భవానీ, చవ్వాకుల ఈశ్వరరావు, ఎం.సతీష్, పెద్దాడ రామ్ శంకర్, గ్రామకార్యదర్శి శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భగవద్గీత శ్లోకాల పోటీలు


విద్యార్థులతో భారత వికాస పరిషత్ సభ్యులు

అనకాపల్లిటౌన్ : స్థానిక గాంధీనగరం ప్రాథమిక పాఠశాలలో భారత వికాస పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం భగవద్గీత శ్లోకాల పోటీలు జరిగాయి. ఈ పోటీలకు 39 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులు తమ ధారణ సామర్థ్యంతో చెప్పిన శ్లోకాలు ఆహూతుల్ని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పరిషత్ కార్యదర్శి ఎస్‌పీబీ వర్మ, కన్వీనర్ వై.కేశవరావు, కో కన్వీనర్ ఎస్.కోటేశ్వరరావు, నానాజీ, వి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

కబడ్డీ.. కబడ్డీ


రసవత్తరంగా సాగుతున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

సబ్బవరం: మండలంలోని తవ్వవానిపాలెంలో కొలువైన పరదేశిమాంబ పండగను పురస్కరించుకుని నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నమెంట్ శుక్రవారం రసవత్తరంగా సాగింది. పోటీలను జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు ప్రారంభించారు. విజేతలుగా నిలిచిన జట్లకు వైఎస్సార్‌సీపీ నాయకుడు ,పారిశ్రామిక వేత్త బోకం శ్రీనివాస్ ఆర్థిక సాయంతో బహుమతులు అందజేయనున్నారు. ఆహ్వాన పోటీల్లో 12 జట్లు పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బోకం స్వామినాయుడు, మండల వ్యవసాయ సలహా కమిటీ డైరెక్టర్ బోకం కాసుబాబు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు అండగా ఎమ్మెల్యే బాబూరావు


నక్కపల్లి ఆస్పత్రిలో మహిళకు ధైర్యం చెబుతున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి: జాతీయరహదారిపై పి.ధర్మవరం వద్ద శుక్రవారం జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో గాయపడిన వారికి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అండగా నిలిచారు. ప్రమాదం జరిగిన వెంటనే ఎమ్మెల్యే హుటాహుటిన ధర్మవరం చేరుకున్నారు. పోలీసులను, స్థానికులను అప్రమత్తం చేశారు. బస్సు నుంచి బయటకు తీసిన క్షతగాత్రులను ఆటోలు, 108 వాహనాలలో నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం నక్కపల్లి ఆస్పత్రికి చేరుకుని వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశారు. పరిస్థితి విషమంగా ఉన్న వారిని విశాఖ కేజీహెచ్ తరలించే ఏర్పాటు చేయించారు. చాలా సేపు ఆయన ఆస్పత్రిలోనే ఉండి బాధితులను ఓదార్చడంతో పాటు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రయాణికుల ప్రాణాలు కాపాడడంలో చాకచక్యంగా వ్యవహరించిన బస్సు డ్రైవర్ రమణను అభినందించారు.

బాధితులకు మాజీ ఎమ్మెల్యే చెంగల పరామర్శ

బస్సు ప్రమాదంలో గాయపడిన వారిని, మరణించిన వారి కుటుంబీకులను మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకటరావు పరామర్శించారు.ఆస్పత్రికి వచ్చిన ఆయన చికిత్స పొందుతున్న వారి వద్దకు వెళ్లి ఆందోళన చెందాల్సినఅవసరంలేదని భరోసా ఇచ్చారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో సుధాకర్‌ను గెలిపించాలి


పట్టభద్రుల ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం: ఉత్తరాంధ్రాపట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కోరారు. కొరుప్రోలు క్యాంపు కార్యాలయం నుంచి ఎమ్మెల్యే శుక్రవారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి సుధాకర్‌ను ఎన్నుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కొరుప్రోలు ఇన్‌చార్జ్ సర్పంచ్ కొరపాటి గోపాలం తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థినులకు అభినందన


ఆదిత్యను అభినందిస్తున్న తిమ్మరాజుపేట హైస్కూల్ ఉపాధ్యాయులు


విద్యార్థినులను అభినందిస్తున్న కోటవురట్ల జెడ్పీ ఉన్నత ఉపాధ్యాయులు

కోటవురట్ల: సైన్స్ ఎగ్జిబిషన్‌లో అనకాపల్లిలో నిర్వహించిన జిల్లాస్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనలో కోటవురట్ల, మునగపాక, నక్కపల్లి మండలాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపి ఆయా అంశాల్లో ప్రథమ బహుమతులు సాధించి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. కోటవురట్ల జెడ్పీ బాలికోన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థినులు పొన్నాడ పద్మశ్రీ , శ్రీపాద మనస్వినిలు ఎకో ఫ్రెండ్లీ మెటీరియల్‌తో రూపొందించిన విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుకు ప్రథమ బహుమతి లభించింది. విద్యార్థినులతో పాటు ఈ ప్రాజెక్టు రూపకల్పనలో సలహాలు ఇచ్చి ప్రోత్సహించిన ఉపాధ్యాయిని డి.లక్ష్మీ ప్రసన్నను పాఠశాల హెచ్‌ఎం ఏసుదాసు, అధ్యాపకులు అభినందించారు.

మునగపాక: జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ చూపిన తిమ్మరాజుపేట హైస్కూల్ 8వ తరగతి విద్యార్థి సూరిశెట్టి ఆదిత్య, అతనికి సహకరించిన గణిత ఉపాధ్యాయుడు తిరుపతి లక్ష్మీనాయుడులను ఆ పాఠశాల హెచ్‌ఎం సునీత, ఉపాధ్యాయులు అభినందించారు. ఆదిత్య రూపొందించిన మల్టీ జామెట్రికల్ మోడల్ ప్రాజెక్టుకు జిల్లాస్థాయిలో ప్రథమస్థానం లభించింది. దీంతో ఈ ప్రాజెక్టును రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైంది.ఈ నెల 27,28 తేదీల్లో విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ ప్రాజెక్టును ప్రదర్శించనున్నారు.

నక్కపల్లి: విజ్ఞాన ప్రదర్శనలో ప్రతిభ చూపిన గొడిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులను హెచ్‌ఎం రామప్రతాప్‌రావు, ఉపాధ్యాయులు అభినందించారు. పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యకరమైన గ్రామం అనే అంశంపై విద్యార్థులు ప్రాజెక్టు తయారు చేశారు.ఈ ప్రాజెక్టు ప్రథమ బహుమతికి ఎంపికైంది.


ప్రథమ బహుమతికి ఎంపికైన గొడిచర్ల విద్యార్థుల ప్రాజెక్టు


అంతర్ పంటతో అదనపు ఆదాయం



భీమవరం వద్ద బొప్పాయిలో అంతర్ పంటగా ఆకు కూరల సాగు

కశింకోట : మండలంలోని పలు గ్రామాల్లో బొప్పాయిలో అంతర్ పంటలు సాగు చేయడం వల్ల రైతులకు అదనపు ఆదాయం సమకూరుతోంది. మరో వైపు భూసారం పోకుండా రక్షణ లభించనుంది. జి.భీమవరం, అచ్చెర్ల, సింగవరం, చెరకాం, అడ్డాం తదితర గ్రామాల్లో సుమారు 20 ఎకరాల్లో బొప్పాయి సాగు చేస్తున్నారు. ఇది సాగు చేయడం ప్రారంభించినప్పటి నుంచి ఫలసాయం వచ్చేసరికి సుమారు ఆరు నెలలు పడుతుంది. ఈలోగా అదనపు ఆదాయం కోసం ఆకు కూరలు, కూరగాయలు అంతర్ పంటలుగా వేసి రైతులు సాగు చేపట్టారు. వీటి ఫలసాయం నెలరోజుల్లోనే వస్తుండటంతో రైతుల మక్కువ చూపుతున్నారు. అదనపు ఆదాయంతోపాటు, ప్రధాన పంట సంరక్షణకు కూడా అంతర్ పంటలు దోహదపడుతున్నాయని చెప్తున్నారు. ప్రధాన పంట బొప్పాయి ఫలసాయం చేతికందే ఆరుమాసాల వరకు వీటి నుంచి ఆదాయం పొందొచ్చంటున్నారు. అంతర్ పంటల వల్ల భూసారం కొట్టుకుపోకుండా పరిరక్షించుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సూచిస్తున్నారు.

'ఉపాధ్యాయ' ప్లాటినం జూబ్లీ వేడుకలు రేపు


సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ

అనకాపల్లిటౌన్ : ఏపీటీఎఫ్‌కు చెందిన 'ఉపాధ్యాయ'మేగజైన్ ప్లాటినం జూబ్లీ ఉత్సవాలను ఈ నెల 26న తిరుపతిలో నిర్వహించనున్నట్టు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ తెలిపారు. స్థానిక నర్సింగరావుపేట ఏపీటీఎఫ్ భవనంలో శుక్రవారం జరిగిన విశాఖ ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమరాన త్రినాథ, పూర్వపు కార్యదర్శి బి.వెంకటపతిరాజు, జిల్లా అధ్యక్షుడు ఎన్.వి.సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎస్.సన్యాసినాయుడు, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రామకృష్ణారావు, అల్లూరి జిల్లా అధ్యక్షుడు రావుల జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

2న మండల సమావేశం

మునగపాక:మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మార్చి 2న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో పి.రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు మండల పరిషత్ హాలులో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు,అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

64 మందికి నేత్ర పరీక్షలు


వాడ్రాపల్లిలో వైఎస్సార్ కంటి వెలుగు శిబిరాన్ని సందర్శిస్తున్న సర్పంచ్ నూకరాజు

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లిలో శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్ కంటి వెలుగు శిబిరంలో 64 మందికి వైద్యాధికారి సంధ్య పరీక్షలు నిర్వహించారు. శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు 15మందిని గుర్తించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు ప్రారంభించారు.

విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలి


బహుమతి అందజేస్తున్న బాపునాయుడు

మునగపాక: విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకొని తల్లిదండ్రులకు,పాఠశాలకు పేరు తీసుకురావాలని నాగులాపల్లి హైస్కూల్ పీఎంసీ చైర్మన్ మళ్ల బాపునాయుడు అన్నారు. మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన వారికి ఆయన శుక్రవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాభివృద్ధికి మ్యాజిక్ బస్ సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీనారాయణ,అకాడమిక్ ఎడ్యుకేటర్ బి.రేవతి,పి.ఆనంద్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్, రెవెన్యూసిబ్బంది

నక్కపల్లి: మండలంలోని రేబాక గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి శుక్రవారం రెవెన్యూ సిబ్బంది ఆర్థిక సాయం అందజేశారు. గురువారం అర్ధరాత్రి కర్రి నాగేశ్వరరావుకు చెందిన తాటాకు ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. దుస్తులు, నిత్యావసర వస్తువులు, పత్రాలు, వంటపాత్రలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. నిరాశ్రయులైన బాధిత కుటుంబాన్ని సర్పంచ్ సాదిరెడ్డి శ్రీను, ఇన్‌చార్జ్ తహసీల్దార్ నీరజ పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకటరావు కూడా బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థికసాయం, నిత్యావసర సరకులు అందజేశారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు


కర్రివానిపాలెంలో అపరాల సాగును పరిశీలిస్తున్న రవిప్రకాష్

ఎస్.రాయవరం: అపరాల సాగులో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని యలమంచిలి సబ్ డివిజన్ సహాయ సంచాలకులు రవిప్రకాష్ అన్నారు. కర్రివాని పాలెం, లింగరాజుపాలెం గ్రామాల్లో పర్యటించి అపరాల సాగును క్షేత్ర స్థాయిలో పరిశీలించి, రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

మునగపాక:మండలంలోని ఉమ్మలాడలో మరిడిమాంబ ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహించారు.